





ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి సంధ్యారాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వ ధ్యేయం

» మంత్రి గుమ్మడి సంధ్యారాణి

కొయ్యలగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి):'సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వ ధ్యేయం. కొయ్యలగూడెం మండల అభివృద్ధి నా వంతు కృషి చేస్తా. ఈ గ్రామంలోని ఎస్టీలకు ఐటీడీఏ ద్వారా అన్ని పథకాలు అందిస్తాం' అని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. కొయ్యలగూడెంలోని తారకరామ్ నగర్‌లో శనివారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు, ఇంటింటా టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అందరికీ తల్లికి వందనం అమలు చేశాం' అన్నారు. అనంతరం తారకరామ్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, నియోజకవర్గ పరిశీలకుడు నారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఏకలవ్య ఏరుకల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములుకండి

» ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య



ఏలూరు,జూలై 19 (ఆంధ్రజ్యోతి):స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా మన ఇంటి నుంచి ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, క్లాత్ సంచులను వినియో గించి స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య మహిళలకు విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలో ఏలూరు సీఐ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కార్యాలయ పరిసరాలను ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండురంగారావు, ఎస్‌ఐలు, సిబ్బంది పరిశ్రుభం చేశారు. ప్లాస్టిక్ వద్దు.. చేతి సంచులే వాడతామని కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. 150 మంది మహిళలకు జూట్ బ్యాగులను, మట్టి కుండలను పంపిణీ చేశారు. అలాగే బీసీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఈడీ ఎన్.పుష్పలత, ఏఈవో ప్రమీలారాణి, ఇతర సిబ్బంది పరిసరాలను శ్రమదానంతో పరిశుభ్రం చేశారు.

కుదురుకున్నారు!

- ఒకప్పుడు రోడ్లు పాడయ్యాయి. మరమమ్మతులు చేయండి మహాప్రభో అంటే పట్టించుకునేవారే లేరు.
- ఆ ఊరికి కనీసం పది అడుగులు వేయాలన్న కనాకష్టంగా ఉంది, దీని నుంచి బయటపడాలంటే ఎంతో కొంత నిధులివ్వండంటే నయాపైసా విదిలిస్తే ఒట్టు.
- ధాన్యం సొమ్ములు బకాయి పడ్డాయి.. నాడు-నేడు పనులు పూర్తవడం లేదు. తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయి. వీటికి మోక్షం లేదు. కాస్త పట్టించుకోడంటూ ఎమ్మెల్యేలను కోరినా అంతే సంగతులు.
- జిల్లా స్థాయి అధికారులు నివేదించాం. అక్కడ నుంచి ఆదే శాలు రావాలి. అప్పటివరకు మీరు నేను చేసేదేమీ లేదు. సర్దుకుపొండి.. క్షేత్రస్థాయిలో అధికారుల ఆనాటి మాటలివి.

పనితీరుపై ప్రభుత్వం ఫోకస్ .. ముఖ్య శాఖల్లో భారీ కదలిక

» విభాగాధిపతులు, సిబ్బందిలోనూ మార్పు
» కలెక్టర్, జేసీతో సహా ఆకస్మిక తనిఖీలకు అధికారులు
» ఐదేళ్ల జగన్ జమానాకు పూర్తిగా భిన్నం



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏడాదిలో ఎంత మార్పు. ఐదేళ్ల జగన్ జమానాలో పాలనా యంత్రాంగం పూర్తిగా పడకేసింది. చేసేందుకు పనుల్లేక, చేతినిండా నిధుల్లేక, ఏ శాఖ చూసినా అంతటా నిర్లిప్తతే. కానీ తెలుగుదేశం ప్రభుత్వం యంత్రాంగంలో చురుకుదనం తెచ్చింది. ప్రభుత్వ విభాగాల్లో రోజూవారీ పనితీరును బేరీజు వేస్తోంది. జిల్లాల వారీగా శాఖల పురోగతిని నిర్దేశిస్తోంది. ఆదాయ, వ్యయాలపై నియంత్రణ పాటిస్తోంది. ప్రత్యేకించి గత వైఫల్యాలను సరిదిద్దుతూనే, ఇంకోవైపు తమ ముద్ర వేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. గతంలో మాదిరిగా ఆయా శాఖల్లో నాన్చుడి ధోరణి, నిర్లక్ష్యం కనిపిస్తే ఉపేక్షించబోమని ఇప్పటికే వార్నింగ్ ఇచ్చింది. వైసీపీ అనుకూల వాసనలు ఇంకా కొనసాగేలా కొన్నిశాఖల్లో సిబ్బంది పనితీరు ఉంది. ఇంతకు ముందు వీరంతా పార్టీపరంగా పక్షపాతం చూపించేవారు. పనులు విషయంలోను ఈ ధోరణి కనిపించేది. జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, పౌరసరఫరాలశాఖ, మైనింగ్, జిల్లా పరిషత్, డీసీసీబీ, డీసీఎంఎస్, సంక్షేమ విభాగాల్లోను ఈ తరహా ధోరణి ఎక్కువగా కనిపించేది. ఈ మధ్యకాలంలో కొందరు బదిలీ కావడం, మరికొందరు బహిర్గతంగా తమ అనుకూలత ప్రదర్శించకుండా జాగ్రత్తపడడంతో రోజూవారీ కార్యకలాపాలు పూర్తిగా పుంజుకున్నాయి. జిల్లాస్థాయిలోను మున్సిపల్, రెవెన్యూ డివిజన్ కేంద్రాల పరిధిలో సాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లోనూ ఈ మధ్యన అధికారులు తక్షణ చర్యలకు దిగే ప్రయత్నం చేస్తున్నారు. రెవెన్యూపరంగా కొన్ని సమస్యలు యథావిధిగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఈ మధ్యనే సచివాలయ సిబ్బందిని జిల్లా వ్యాప్తంగా బదిలీలు చేశారు. స్థానికంగా పాతుకుపోయి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అనేక మందికి స్థానచలనం కలగడంతో సచివాలయా ల్లో పనితీరు మెరుగుపడింది. పౌరసరఫరాల విభాగంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగడం ఒక ఎత్తైయితే, పాత వాసనలు కాస్తంత తగ్గించుకుని ఈ మధ్యనే గాడిలో పడుతున్నారన్న వాదనకు బలం చేకూరింది.

ఆకస్మిక తనిఖీలూ ఆరంభం

జిల్లాస్థాయిలో ఆకస్మిక తనిఖీలకు గడిచిన రెండు, మూడు మాసాలుగా అధికారులు వీలు కుదిరినప్పుడు ప్రయత్నిస్తున్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి ఈ మధ్య కాలంలో వరుసగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల దగ్గర నుంచి మధ్యాహ్న భోజనం వరకు దగ్గరుండీ మరీ పరీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ధైర్యం కల్పించేలా, ఆఖరికి ఎరువుల దుకాణాలను కూడా తనిఖీ చేసి వ్యాపారులకు వార్నింగ్ ఇస్తున్నారు. దీంతో విద్యవైద్య రంగాల్లోనూ ఈ ఆకస్మిక తనిఖీల ప్రభావం పడింది. ప్రభుత్వ వైద్యఆరోగ్యశాఖ విభాగంలో ఆది నుంచి నిర్లక్ష్యమే. ఈ శాఖను సరిదిద్దేందుకు పదేపదే డీఎంఅండ్‌హెచ్‌వోలను మారుస్తూ వచ్చారు. ఈ శాఖను గాడిన పెట్టేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తాజాగా బాధ్యతలు స్వీకరించిన జాన్ అమృతం, ఐసీడీఎస్ పీడీ పి.శారద, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషాలు సైతం ఆకస్మిక తనిఖీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.



సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు : జేసీ

ముదినేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు ఎటువంటి జాప్యం చేయవద్దని, ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, జిల్లాస్థాయి పరిష్కార వేదిక నుంచి అధికారులు పంపిన రిఫరెన్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో భూముల సమస్యలు, జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్‌కు సంబంధించి అర్జీలు ఇచ్చిన వారితో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. వివిధ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడారు. మండలంలో రెవెన్యూ కార్యకలాపాలను శిస్తు వసూళ్లు, మ్యూటేషన్ జరుగుతున్న తీరు తదితర అంశాలపై తహసీల్దార్ లతీఫ్‌పాషా, డీటీలు పవన్‌కుమార్, యు.శ్రీనివాస ప్రసాద్, ఇతర అధికారులతో చర్చించారు. మండల సర్వేయర్ పోస్టు భర్తీ చేయాలని తహసీల్దార్ కోరారు.



గుండుగొలనులో ఎరువుల దుకాణంలోని రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎరువుల కొరత లేదు : కలెక్టర్

భీమడోలు/ఉంగుటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో రైతాంగానికి సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి. రైతాంగానికి ఎరువుల కొరత రానియొద్దు. ఎరువుల అక్రమ రవాణాను అరికట్టండి. వ్యాపా రులు అధిక ధరలకు విక్రయించిన, బ్లాక్ మార్కెట్‌కు తరలించిన, నకిలీ మందులు విక్రయించిన కేసులు నమోదు చేయండి' అంటూ కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. భీమడోలు మండలం గుండుగొలనులో ఎరువుల దుకాణాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా, వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఉంగుటూరు మండలం చేబ్రోలులోని ఉర్దూ పాఠశాలను కలెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతులు, మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి పరిశీలించి స్థానిక డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. ఆపై కుంగిన నారాయణపురం వంతెనను, నారాయణపురం-తెల్లాపురం దండువారి పుంత రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలసి పరిశీలించారు. నారాయణపురం సొసైటీని సందర్శించి ఎరువుల స్టాక్ వివరాలు పరిశీలించారు. సర్పంచ్‌లు రాంధే లక్ష్మీ సునీత, దిడ్ల అలకనంద తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రవేశాల జోష్

పది ప్రాజెక్టుల పరిధిలో చిన్నారుల సంఖ్య

ప్రాజెక్టు పేరు	ప్రస్తుతం	కొత్తగా చేరిక
భీమడోలు	1801	305
బుట్టాయగూడెం	1497	207
చింతలపూడి	3154	491
ఏలూరు	2195	588
జంగారెడ్డిగూడెం	3442	531
కైకలూరు	2683	472
కొయ్యలగూడెం	1326	306
కుక్కునూరు	1727	198
నూజివీడు	4722	762
పెదపాడు	2076	480
మొత్తం	24,623	4,340

» కొత్తగా 4,340 మంది చిన్నారుల చేరిక
» 11,387 మందికి బడుల్లోకి ప్రమోషన్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లు కొత్త చిన్నారుల చేరికతో జోష్ పెరిగింది. 'రండి..అంగన్‌వాడీ పిలుస్తోంది' పేరిట జూన్ 12 నుంచి నెలాఖరు వరకు 2,225 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో టీచర్లు, ఆయాలు చేపట్టిన ప్రచార కార్యక్రమాలు ఫలించాయి. ప్రజల వద్దకు వెళ్లి కేంద్రాల ఆవశ్యకతను, సౌకర్యాలపై విశదీకరించారు. ప్రతీ అంగన్‌వాడీలో వాటర్ ప్యూరిఫయర్లు, అధునాతన ఆట పరికరాలు, సులు వైన బోధన సామగ్రితో ఆకట్టుకుంటున్నాయి. మెరుగైన పౌష్టికాహారం అందించడంతో పాటు, ఆయాలు, టీచర్లు ఆటపాటలతో చదువు చెప్పడంతో ఈసారి ప్రవేశాల సంఖ్య గతేడాది కంటే పెరిగిందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 4,340 మంది చిన్నారులు కొత్తగా ప్రవేశాలను పొందారు. ప్రస్తుతం అంగన్‌వాడీల్లో ఉన్న 24,623 మందికి అదనంగా చేరిన ఈ చిన్నారులను కలిపితే మొత్తం 28,963 మందికి చేరారు. ఈ నెలాఖరుకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరడానికి నిర్దీత గడువేమి ఉండదు. స్థానిక అంగన్‌వాడీల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను చేర్చేందుకు ఆధార్, తల్లిదండ్రుల రేషన్ కార్డులు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, ఫొటోలను తీసుకెళ్లి చేర్పించవచ్చు.

అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసిన 11,387 మంది చిన్నారులను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలను అధికారులు పూర్తి చేశారు. ఏలూరు సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో 1,417 మంది, అత్యల్పంగా పెదపాడు ప్రాజెక్టు నుంచి 82 మంది పిల్లలు బడుల్లో ఒకటో తరగతిలోకి ప్రవేశించారు. నూతనంగా చేరికలపై ఐసీడీఎస్ పీడీ శారద మాట్లాడుతూ ఇంకా చేరికలపై క్షేత్రస్థాయిలో కృషి చేస్తామన్నారు.



బావాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చేరుతున్న చిన్నారులు

పెన్షన్ కావాలంటే..

రూ.55 వేలు లంచమివ్వు

» రూ.20 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సబ్ ట్రెజరీ ఉద్యోగి



కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ సర్దుపై చేసేందుకు కైకలూరు సబ్ ట్రెజరీ ఉద్యోగి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. శనివారం ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం తహసీల్దార్ కార్యాలయాల్లో అటెం డర్‌గా పనిచేసి తొమ్మిదేళ్ల క్రితం కైకలూరుకు చెందిన షేక్ అబ్దుల్ సుబానీ రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి కొన్ని సమస్యల వల్ల పెన్షన్ ఫిక్స్ కాలేదు. వాటిని అధిగమించి గత మార్చి నెల నుంచి కైకలూరు సబ్‌ట్రెజరీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కె.హనుమంతరావు (ఆంజనేయులు) గ్రాట్యుటీ అమౌంటు రూ.6 లక్షలు, 9 సంవత్సరాల నుంచి పెన్షన్ కలిపి రూ.33 లక్షలు వస్తుందని 2 శాతం చొప్పున రూ.66 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని సుబానీ చెప్పడంతో చివరకు రూ.55 వేలు ఇవ్వాలంటూ తేల్చిచెప్పాడు. దీంతో ముందుగా రూ.10 వేలు చెల్లించగా ఇటీవల పెన్షన్ ఫిక్స్ చేశాడు. గ్రాట్యుటీ సొమ్ము ఇప్పించాలని కోరగా ఇస్తానన్న సొమ్ములో కేవలం రూ. పది వేలే చెల్లించావు.. మిగతా రూ.45 వేలు బాకీ ఉన్నావన్నాడు. అందుకు సుబానీ తొమ్మిదేళ్లుగా పెన్షన్ రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నానని ప్రస్తుతం అంత చెల్లించుకోలేనని చెప్పడంతో ముందుగా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత సొమ్ము ఇవ్వలేక బాధితుడు సుబానీ ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలోనే రూ.20 వేలు కైకలూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో హనుమంతరావు తీసుకుంటుండగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కెమికల్ టెస్టుల్లో కూడా లంచం తీసుకున్నట్లుగా నిరూపణ అయిందని, అతనిపై కేసు నమోదు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు, రాజమండ్రి ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, శ్రీనివాసు, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

» పగలంతా ఎండ.. సాయంత్రమైతే వర్షాలు
» జిల్లాలో విభిన్న వాతావరణం
» చింతలపూడిలో 60 మి.మీ వర్షపాతం నమోదు

ఏలూరుసిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం విభిన్న వాతావరణం కొనసాగుతోంది. పగలంతా ఎండలు మండుతుండగా మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తర్వాత మబ్బులతో కూడిన వాతావరణం ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ద్రోణి కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కురిసింది. నిన్న మొన్నటి వరకు వర్షాభావ పరిస్థితుల కారణంగా వర్షాలు మొఖం చాటేసినా ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో సార్వా వరి నారుమళ్లు, నాట్లు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గత 24 గంటల్లో అత్యధికంగా చింతలపూడి మండలంలో 60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 5.3 మి.మీగా నమోదైంది. కొయ్యలగూడెం 24.2, చాట్రాయి 15.4, ముదినేపల్లి 11.4, కైకలూరు 8, జీలుగుమిల్లి 7.4, వేలేరుపాడు 6, కామవరపుకోట 5.8, జంగారెడ్డిగూడెం 4.6, టి.నరసాపురం 2, ఆగిరిపల్లి 1.8, నూజివీడు 1.4, లింగపాలెం 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రిజిస్ట్రేషన్లకు స్టాంపుల కొరత

» జోరందుకున్న బ్లాక్ మార్కెట్
» స్టాంపుల కొరత లేదు : జిల్లా రిజిస్ట్రార్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రిజిస్ట్రార్, సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత వేధిస్తోంది. ఇదే అదునుగా కొందరు లైసె న్సు వెండర్లు స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని వారాలుగా ఈ సమస్య ఉంది. రూ.10, రూ.20 స్టాంపులను రూ.150కు, రూ.50 స్టాంపు రూ.250, రూ.100 స్టాంపు రూ.400లకు విక్రయిస్తుండడంతో క్రయ, విక్రయదారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. జిల్లాలో 12 కార్యాలయాల్లో గతంలో స్టాంప్‌లతో పాటు ఈ-స్టాంపింగ్ విధానం అమలు ఉండేది. ఎవరికి నచ్చిన పద్ధతిలో స్థలాల క్రయ, విక్రయాలు కొనసాగించు కునే వారు. తెలుగుదేశం ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత నాన్ జ్యుడీషి యల్ స్టాంపుల విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో ఈ-స్టాంపింగ్ విధానంపై కక్షి దారులు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. జ్యుడీషియల్ స్టాంపుల వైపు మొగ్గు చూపుతుండడంతో వాటికి డిమాండ్ పెరిగి కొరత ఏర్పడుతోంది. బ్లాకులో స్టాంపులను విక్రయించడం కారణంగా అధిక లాభాలు వస్తుండడంతో పలువురు స్టాంప్ వెండర్ లైసెన్సుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు మధ్యవర్తులు సిఫార్సులు చేసి లైసెన్సు ఇప్పించేందుకు రూ.లక్ష పైబడే డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. స్టాంపులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే విషయం బహిరంగ రహస్యమే అయినా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ (మిగతా 8వ పేజీలో)

ఏపీ నిట్.. సూపర్‌హిట్



దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆసక్తి

» 480 సీట్లకు అడ్మిషన్‌లు.. 455 మందికి కేటాయింపు
» ఆరో విడత కౌన్సెలింగ్‌లో మరికొందరు చేరే అవకాశం
» తదుపరి స్పాట్ కౌన్సెలింగ్ నాటికి మొత్తం సీట్లు భర్తీ
» సీఎస్‌ఈలో గత ఏడాది పది వేల ర్యాంకుతో ప్రారంభం
» ఈ ఏడాది తొమ్మిది వేల నుంచే..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్)లో సీట్ల కోసం డిమాండ్ ఏర్పడింది. దేశ వ్యాప్తంగా జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ సారి ఏపీ నిట్‌లో చేరుతున్నారు. గత ఏడాది సీఎస్‌ఈలో 10 వేల ర్యాంక్ నుంచి అడ్మిషన్లు ప్రారంభమైతే.. ఈ ఏడాది తొమ్మిది వేల ర్యాంక్ నుంచే అడ్మిషన్లు తీసుకున్నారు. వాస్త వానికి 750 సీట్లకు చేరిన నిట్ ఫ్యాకల్టీ లేద ని, హాస్టల్ సౌకర్యం తక్కువగా ఉందంటూ 480 సీట్లకే పరిమితం చేసేశారు. రెగ్యులర్ డైరెక్టర్ నియామకం జాప్యంతో కేంద్రం నుంచి నిధులు మంజూరులోనూ వెనుకబడిం ది. రూ.400 కోట్లతో అభివృద్ధికి పంపించిన పెండింగ్‌లో ఉన్నాయి. బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నియామకం చేపట్టలేకపోతున్నారు. ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ నిట్‌ను సందర్శించడం గగనమైంది. సాధారణ పాలనాపరమైన అంశాలకే ఇన్ ఛార్జ్ డైరెక్టర్ పరిమితమవుతున్నారు. దీనివ ల్ల నిట్ పురోగతి మందగిస్తోంది. డైరెక్టర్ నియామకం జరిగితే నిట్ మళ్లీ గాడిన పడుతుంది. సీట్ల సంఖ్య పెరుగుతుంది. ఒక దశలో ఏపీ నిట్ దక్షిణాదిలోనే నెంబర్-1 విద్యా సంస్థ అవార్డుకు ఎంపికైంది. అటువం టిది ఇప్పుడు సీట్లు కుదించే పరిస్థితికి వచ్చేసింది. అయినా సరే ప్లేస్‌మెంట్స్‌లో తన స్థానాన్ని పదిలపరచుకుంటూ వస్తోంది. నిట్ లో అన్ని వసతులు బాగున్నాయంటూ విద్యా ర్థులు సంతృప్తి చెందుతున్నారు. డైరెక్టర్ లేక పోవడం ఒక్కటే సమస్యగా ఉందని విద్యార్థు లు ఆందోళన చెందుతున్నారు. డైరెక్టర్ ఉంటే మంచి కంపెనీలను రప్పించి ప్లేస్‌మెంట్స్ కోసం మరింత కృషిచేస్తారు. కంపెనీలు ఆసక్తి చూపుతాయి. డైరెక్టర్ లేకపోవడంతో అంతర్జా తీయ స్థాయిలో పేరు పొందిన కంపెనీలు రావడం లేదు. ప్లేస్‌మెంట్స్‌లో ప్యాకేజీలు తగ్గిపోతున్నాయి.

ఫ్రీజింగ్ చేసుకుంటున్న విద్యార్థులు

దేశంలో ఐఐటీ, నిట్ సంస్థల్లో జోసా కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్‌లు కల్పిస్తారు. జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నిట్‌లో సీట్లు లభిస్తాయి. ఇప్పటి వరకు ఈ ఏడాది ఐదు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. నిట్‌లో 455 మంది అభ్యర్థులు తమ సీట్లను ఫ్రీజ్ చేసుకున్నారు. మరో 25 సీట్ల కోసం ఆరో రౌండ్‌లో విద్యార్థులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఎంపిక చేసుకున్న విద్యార్థులు తమకు అనువైన నిట్‌లో సీట్లు వేస్తే అక్కడ ఫ్రీజ్ చేసుకుంటారు. లేదంటే నిట్‌కే పరిమితమవుతారు. ఇతర నిట్‌లలో సీటు కోసం ఎంపికైన విద్యార్థులు నిట్ తమకు అనుకూలమని భావిస్తే ఆరో రౌండ్‌లో ఫ్రీజ్ చేసుకునే అవకాశం ఉంది. అప్పటికీ నిట్‌లో సీట్లు మిగిలితే జోసా కౌన్సెలింగ్ ద్వారానే రెండు రౌండ్‌లు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్పాట్ కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలే అవకాశం లేదు. గతంలో స్పాట్ కౌన్సెలింగ్ లేకపోవడంతో సీట్లు భర్తీ కాలేదు. ఐఐటీ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి.

దీంతో స్పాట్ కౌన్సెలింగ్ అమలు చేస్తున్నారు. ఫలితంగా ఐఐటీ, నిట్ సంస్థల్లో వంద శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి. నిట్‌కు ఈ ఏడాది విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంటోంది.

బదిలీలపై మళ్లీ భగ్గు! » సవరణలతో కూడిన సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై ఫిర్యాదులు ■ లోపలి పేజీలో..


ఆలయ వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో స్వామి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

ద్వారకాతిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలం భక్తజన సందోహంగా మారింది. స్వామికి ప్రీతికరమైన శనివారం కావడంతో ఆలయానికి వేలసంఖ్యలో భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ పరిసరాల్లో శ్రీవారి నామస్మరణ మార్మోగింది. దాదాపు 15 వేలమంది భక్తులు శ్రీవారికి పూజలు జరిపినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెల్లవారుఝాము నుంచే ఆలయానికి భక్తులరాక ప్రారంభమైంది. పలువురు భక్తులు కేశ ఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవారి సాధారణ దర్శనానికి గంటల పైబడి సమయం పట్టింది.


ప్రిన్సిపాల్ రాజారావును అభినందిస్తున్న అధికారులు

'పీఎం శ్రీ' పాఠశాలగా పెదతాడేపల్లి గురుకులం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 25 గురుకుల పాఠశాలల్లో 'పీఎం శ్రీ' ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈమేరకు శనివారం గురుకుల పాఠశాలను ఎంపిక కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్యాంకుమార్ ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైనట్టు వివరించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్, ల్యాబ్, కెరీర్ గైడెన్స్ ల్యాబ్, ఫుడ్ ప్రాసెసింగ్, ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూంలు తదితర అంశాల్లో ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావును ఎంఈవో వి.హనుమ, పీఎంకే జ్యోతి, ఏఎంవో సుబ్రహ్మణ్యం, పీఎంశ్రీ ఏఈ వీరస్వామి అభినందించారు.


పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

ఆకివీడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆక్రమణలు తొలగించారు. స్థానిక ధర్మాపురం అగ్రహారంలోని మంచినీటి చెరువుగట్టున ఉన్న 24 మంది ఆక్రమణదారుల ఇళ్లను పోలీసు బందోబస్తు మధ్య నగర పంచాయతీ అధికారులు శనివారం నాలుగు ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది పోలీసులు సీఐ వి.జగదీశ్వరరావు నేతృత్వంలో నాలుగు టీమ్‌లుగా ఏర్పడి ఎటువంటి అల్లర్లు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వల్ప ఘర్షణలు మినహా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం వరకు ఆక్రమణలు తొలగిస్తూనే ఉన్నారు. నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏఈలు సురేష్, విజయ్‌కుమార్, ఎస్‌ఐలు హనుమంతు నాగరాజు, కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

చదరంగంతో మేధాశక్తి పెంపు


విద్యార్థులతో చెస్ ఆడుతున్న ఆర్డీవో దాసిరాజు

నరసాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి చదరంగం ఆడడం వల్ల మేధాశక్తి పెంపొందుతుందని ఆర్డీవో దాసిరాజు అన్నారు. శనివారం చిన మామిడిపల్లి సంసిద్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. పలు ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు వంద మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇటువంటి పోటీల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులందించారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు కిశోర్, ప్రిన్సిపాల్ దుర్గ లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం మాజీ కమిషనర్‌కు ఏసీబీ నోటీసు ?

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో అక్కడ భవన నిర్మాణంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుతం నెల్లూరు జిల్లా కావలి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రావణ్ కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పదిహేను రోజులలో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను తిరుపతిలో ఉన్నానని తనకు ఎలాంటి నోటీసు అందలేదని చెప్పారు. అయితే జంగారెడ్డిగూడెంలో పని చేసేటప్పుడు ఒక భవన నిర్మాణంపై కేసు నడుస్తుందనే విషయం తెలిపారు.



పొగ ఊదేస్తున్నారు

ధూమపానం నేరం.. నష్టం ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ కొంతమంది నిర్లక్ష్యం వల్ల కనీసం బహిరంగ ప్రదేశాల్లో కూడా నియంత్రణ సాధ్యం కావడం లేదు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, దేవాలయ పరిసరాల్లో ధూమపానం నేరం అని నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేసి జరిమానాలు విధిచేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. విద్యాసంస్థల చుట్టూ వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం.. అయినప్పటికీ ఇవేమి పట్టనట్టుగా యథేచ్ఛగా అమ్ముతున్నారు.. పొగ తాగేస్తున్నారు.. అవతలి వారిపై ఊదేస్తున్నారు. పొగ తాగడం వల్ల దుష్పరిణామాలు, కోట్పా చట్టం అమలు తీరుపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం

» కోట్పా చట్టం అమలులో లోపాలు » ఆచరణకు పటిష్ఠ ప్రణాళిక నిల్ ?

ద్వారకాతిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

పొగ తాగే అలవాటు ఉన్న వారికి పక్కనున్న వారికి హానికరమని తెలిసినా... పొగబాబులు బహిరంగంగా దమ్ముకొడుతున్నారు. పలు దేశాలు, రాష్ట్రాలు బహిరంగ ప్రదేశాలలో పొగ త్రాగడం నిషేధించాయి. మన దేశంలోనూ బహిరంగ ధూమపానం చట్టరీత్యానేరం. జరిమానాలు కూడా ఉన్నాయి. ఇటువంటి వారిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చినప్పటికీ.. సినిమాహాల్స్, బస్‌కాంప్లెక్స్‌లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, ఆలయాల పరిసరాలను కూడా వదలకుండా కొంతమంది ధూమపాన ప్రియులు బహిరంగంగా స్మోకింగ్ చేసేస్తున్నారు. నో స్మోకింగ్ బోర్డులు ఎదురుగా ఉన్నప్పటికీ.. సినిమాల ప్రదర్శనలకు ముందు, టీవీల్లోనూ పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ వారు పట్టించుకోరు. ఇష్టమొచ్చిన రీతిలో ఎక్కడపడితే అక్కడ సిగరెట్లు పీల్చుతుంటారు. కోట్పా చట్టం సెక్షన్-4ప్రకారం బహిరంగ ధూమపానం నేరం... 200 రూపాయల వరకూ జరిమానా విధించవచ్చు.


ద్వారకాతిరుమలలో ఓ షాపులో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై పోలీసుల తనిఖీలు (ఫైల్)

పాసివ్ స్మోక్ లేదా సెకండ్ హాండ్ స్మోక్

పక్కవాళ్లు స్మోక్ చేయడం వల్ల వచ్చే పొగను అప్రయత్నంగా పీల్చడం ద్వారా ఇతరులు ప్రాణాపాయానికి గురవుతుంటారు. దేశంలో గుండెజబ్బులు సంభవిస్తున్న ప్రతీ 20మంది మహిళల్లో ఆరుగురు ఈ పాసివ్ స్మోకింగ్ వల్లే మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్మోకింగ్ ప్రభావం వల్ల అనేక మంది మహిళలకు క్యాన్సర్ వస్తోంది, పాసివ్ స్మోకింగ్ వల్ల ముఖ్యంగా బ్రెస్ట్ కాన్సర్, చిన్నారులకు బ్లడ్ క్యాన్సర్ రావచ్చు. పొగ రాయుళ్ల వదిలే పొగ నుంచి విడుదలయ్యే విషప్రభావం గర్భిణులపై ప్రభావం ఉంటుంది. పుట్టే పిల్లలకు గుండె జబ్బులు, నరాల బలహీనత, పేగుక్యాన్సర్ వంటి ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి. పొగతాగే వాళ్ల పక్కనున్న వారు ఏ తప్పు చేయకుండానే పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు.

కోట్పా చట్టం కఠినం చేయాలి..

పవిత్రమైన దేవాలయాల సమీప ప్రాంతాలను సైతం పొగ రాయుళ్లు వదలకుండా రెచ్చిపోతున్నారు. ఇప్పటికే తిరుమల తిరుపతి, విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయాలు పొగాకు ఉత్పత్తులను నిషేధించాయి. ఆధ్యాత్మిక ప్రాంతం పరిసరాలలో ఆరోగ్యవంతమైన వాతావరణం కోసం ధూమపానం చేయకుండా చర్యలు చేపట్టింది. సిగరెట్స్ ఆన్ అదర్ టుబాకో ప్రొడక్ట్స్ యాక్టు-2003 (కోట్పా)ను పటిష్ఠంగా అమలు చేస్తోంది. పొగ తాగే వారితో పాటు దానిని పీల్చే వారిలో 30 శాతం మందికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చింది.

కోట్పా చట్టం ప్రధాన లక్ష్యాలు

- పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించడం
- పొగాకు ఉత్పత్తుల వాణిజ్యం, ఉత్పత్తి, సరఫరా, పంపిణీలను నియంత్రించడం

ముఖ్య నిబంధనలు ఇలా..

- మైనర్లకు సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించడం
- విద్యాసంస్థల చుట్టూ వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం
- పొగాకు ఉత్తత్తుల ప్యాక్‌లపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరి.
- సినిమాలు, టీవీ కార్యక్రమాల్లో పొగాకు వాడకాన్ని చిత్రీకరించడంపై నియంత్రణలు ఉన్నాయి.
- పొగాకు ఉత్పత్తుల పరోక్ష ప్రకటనల నిషేధం

కోట్పా చట్టం అమలు ఇలా..

ఈ చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహిస్తాయి. జాతీయ ఆరోగ్య మిషన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ చట్టం అమలుకు కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రస్థాయిలో పొగాకు నియంత్రణకు ఈ చట్టాన్ని అమలు చేసేందుకు శిక్షణ అవగాహన, కార్యక్రమాలు పర్యవేక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కోట్పా చట్ట నిబంధనలను అతిక్రమిస్తే భారతీయ న్యాయసంహిత చట్టాల ప్రకారం కఠిన చర్యలుంటాయి. పొగాకు వాడకాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చడానికి ఈ చట్టాన్ని రూపొందించారు. చాలా మందికి ఈ చట్టం పట్ల అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి అమలులో లోపాలు కన్పిస్తున్నాయి.

బదిలీలపై మళ్లీ భగ్గు !

» సవరణలతో కూడిన సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై ఫిర్యాదులు



ఏలూరు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎం(హెల్త్ సెక్రటరీ)లకు ఇటీవల జరిగిన బదిలీల్లో తాజాగా మరోదఫా మార్పులు, చేర్పులు చేటుచేసుకున్నాయి. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు ముగిసిన ఏఎన్‌ఎంలకు ఈనెల మొదట్లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌పై వివాదాలు చెలరేగిన విషయం విదితమే. ఈమేరకు బదిలీలు ఖరారైన 594మంది ఏఎన్‌ఎంలను విధుల నుంచి రిలీవ్ చేయవద్దని, ఆ మేరకు తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు ఎక్కడివారక్కడే పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు మౌఖిక ఆదేశాలిచ్చాయి. దీనికనుగుణంగానే తొలుత విడుదల చేసిన జాబితాలో బదిలీ స్థానాలు ఖరారైనవారిలో పలువురి స్థానాలను సవరిస్తూ మొత్తం 584మంది రూరల్ ఏఎన్‌ఎంలతో కూడిన జాబితాను తాజాగా శుక్రవారం రాత్రి విడుదల చేయగా, శనివారం ఉదయం నుంచే పలువురు ఫిర్యాదులతో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరుకోవడం ప్రారంభమైంది. తొలుత జరిగిన జూమ్ కౌన్సెలింగ్‌లో నిబంధనల మేరకు బదిలీ స్థానాలు ఖరారైన పలువురు ఏఎన్‌ఎంలు తాజాగా సవరణలతోకూడిన జాబితాలో స్థానచలనం కలగడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ ప్రమేయం లేకుండా, కనీసం ఐచ్ఛికాలివ్వని స్థానాలకు ఏకపక్షంగా ఎలా బదిలీచేస్తారని ప్రశ్నించారు. ప్రతీ మండలంనుంచి ఇటువంటి ఫిర్యాదులున్నట్టు తెలుస్తోంది. ఫిర్యాదులను తీసుకున్న డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాజా సవరణల్లో అభ్యంతరాలను మాత్రమే స్వీకరిస్తామని, వాటిని పరిష్కరిం చాల్సిన అధికారులు, సంబంధిత సెక్షన్ ఉద్యోగి ప్రస్తుతం అందుబాటులో లేరని పంపించేస్తున్నారని వాపోతున్నారు.

బదిలీ ఏఎన్‌ఎంలలో ఆందోళన

తాజాగా విడుదల చేసిన జాబితాలోవున్న ఏఎన్‌ఎంలందరూ తక్షణమే పనిస్థానాల్లో విధుల నుంచి రిలీవై, ఆ వెంటనే నూతన బదిలీస్థానాల్లో చేరాలని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీచేయడంతో నష్టపోయిన ఏఎన్‌ఎంలలో ఆందోళన నెలకొంది. మరోవైపు తొలుత విడుదల చేసిన బదిలీల జాబితా, తాజాగా సవరణలతో కూడిన జాబితా రెండింటిపైనా రిలీవింగ్, జాయినింగ్‌లను ఈనెల 5వ తేదీని పేర్కొనగా, ఇప్పుడు శనివారం కొత్తస్థానాల్లో చేరితే సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. ఇటీవల జిల్లానుంచి బదిలీఅయిన అధికారి పాలనలో జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియల్లో పారదర్శకత లోపించిందనడానికి డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద గత నెలలో ఒకరోజున తెల్లవారుఝాము వరకు జరిగిన ఆందోళనలు, ఒకసారి బదిలీ ఖరారైన ఉద్యోగుల్లో కొందరికి మళ్లీ మార్పులు, ఆ మేరకు కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత సవరణలు, ఉన్నతాధికారుల చీవాట్లు, స్వయంగా ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవాల్సి రావడం.. తదితరాలన్నీ పరిపాలనాపరమైన వైఫల్యాలుగా భావిస్తున్నారు.

అన్యాయం జరిగితే నేరుగా సంప్రదించండి : డీఎంహెచ్‌వో



సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై వస్తున్న ఫిర్యాదులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం వద్ద వివరణ కోరగా కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాతే తాను జిల్లాలో బాధ్యతలు చేపట్టినందున పూర్తివివరాలు తెలియవన్నారు. బదిలీలు ఖరారైన ఏఎన్‌ఎంలలో కొందరు తమ పనిస్థానాలు, మండలాల పేర్లలో తప్పులు దొర్లాయని శనివారం ఫిర్యాదు చేశారని, వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా కార్యాలయ సిబ్బందిని ఆదేశించానన్నారు. ఇంకా ఎవరికైనా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తే, దానికి సహేతుకమైన ఆధారాలతో నేరుగా వస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.

ఏలూరు జిల్లాలో ఆరు శక్తి టీమ్‌లు

» అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు



ఏలూరు క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణే పోలీస్ ప్రధాన కర్తవ్యమని ఈ దిశగా ప్రత్యేక బృందాలు పని చేయడానికి ఏలూరు జిల్లాలో ఆరు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శక్తిటీమ్ పోలీస్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల రక్షణకు ఆరు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఒక్కొక్క టీమ్‌లో ఆరుగురు సభ్యులు చొప్పున, జిల్లాలో మొత్తం 36 మంది ప్రత్యేక విధులను నిర్వరిస్తారన్నారు. మహిళల పట్ల దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో ప్రత్యేకంగా శక్తిటీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్‌లు జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, స్కూళ్ళు, కాలేజీలు, ముఖ్యమైన కూడళ్లలో మఫ్టీలో కొందరు, యూనిఫామ్‌లో కొందరు నిఘా పెడతారన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే తక్షణమే వారిని అదుపులోకి తీసుకుంటారని తెలిపారు. ఆపద సమయంలో శక్తియాప్‌లో ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112కు కాల్ చేస్తే శక్తిటీమ్ బృందాలు పది నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకుంటాయన్నారు. సమస్యను చట్ట బద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ శక్తిటీమ్ సభ్యులకు బాడీ కెమెరాలు ఉంటాయని అదేవిధంగా డ్రోన్లతో కూడా నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న తమిళనాడు భక్తులు

తమిళనాడు భక్తుల వాసవీ హోమం

పెనుగొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని వాసవీ శాంతి ధామ్‌లో శనివారం తమిళనాడు రాష్ట్రం తిరుపూరు నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. తొలుత వాసవీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): తడికలపూడి పోలీసులు శుక్రవారం రాత్రి రామన్నపాలెం సమీపంలో వాహనాలు తనిఖీ చేయగా ఒక బొలేరో వాహనంలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించి రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు. సివిల్ సప్లయిస్ డీటీ శేషగిరి వాహనంలో వున్న పీడీఎస్ బియ్యంగా గుర్తించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను తడికలపూడి పోలీసులు సీజ్ చేశారు.

క్రైం సమాచారం

గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యం

కలిదిండి/ఉండి,జూలై 19(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. కోరుకొల్లు వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సన్నటి గెడ్డం, ఐదు అడుగుల ఎత్తు. మృతుడు రెండు రోజుల క్రితం గుడ్లవల్లేరు నుంచి కోరుకొల్లు వచ్చే కాలువలో ప్రమాదవశాత్తు పడి చనిపోయి కొట్టుకొచ్చినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 94407 96435 నంబరుకు సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

- ఉండి మండలం బొండాడ డ్రెయిన్‌లో వాండ్రం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు తెలిపిన సమాచారంతో ఉండి పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఈ మృతదేహాన్ని గ్రామ రెవెన్యూ అధికారి చిన్నారావు పరిశీలించి సుమారు 50 ఏళ్ల లోపు వయసు గల వ్యక్తిగా గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు ఉండి ఎస్ఐ నజీరుల్లా 94407 96648 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన శనివారం జరిగింది. పెదతాడేపల్లికి చెందిన కటారి నాగేశ్వరరావు తాడేపల్లిగూడెం వైపు వస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షత గాత్రుడిని విజయవాడకు మెరుగైన చికిత్స కోసం తరలించారు.

షాపులో నగదు చోరీ

ఏలూరు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాత్రివేళ ఒక షాపు తాళాలు పగులగొట్టి దొంగలు నగదు అపహరించుకు పోయారని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ సుంకరవారితోటకు చెందిన తోట మౌనిష ఏలూరు గడియారపు స్తంభం వద్ద షైనీ కిట్స్‌ప్లే జోన్ షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల పదో తేదీ రాత్రి యథావిధిగా షాపు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. పదకొండో తేదీ ఉదయం అక్కడ ఉన్న వాచ్‌మన్ ఫోన్ చేసి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో మౌనిష వెళ్లి పరిశీలించారు. షాపులోని రూ.18 వేల నగదు అపహరణకు గురైందని గుర్తించారు. ఈ ఘటనపై శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

స్వీపర్ అనుమానాస్పద మృతి !

పాలకోడేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న పెనుమాల మరియమ్మ(43) అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన ఆమె గత నెల నుంచి పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తుంది. శనివారం ఉదయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆమె ఇంటి వద్దే పడుకుంది. కారణం ఏమో తెలియదు గాని శనివారం మధ్యాహ్నంకు గుండె బరువెక్కుతుందని స్థానికులకు చెప్పడంతో వారు తొలుత పాలకోడేరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించడంతో ఇంటికి తిరిగి తీసుకొచ్చారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో రూ.50 లక్షలు రికవరీ

చింతలపూడి,జూలై19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాసిం అనే వ్యక్తిని మోసం చేసిన చింతలపూడికి చెందిన రాజకుమార్, ప్రవీణ్ అనే ఇద్దరు రూ.50 లక్షలు కాజేయగా వారిని చాకచక్యంగా పట్టుకుని నగదు రికవరీ చేశామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేసే షేక్ ఖాసిం అనే వ్యక్తికి చింతలపూడికి చెందిన రాజకుమార్, ప్రవీణ్ అనే ఇద్దరు అతని కంపెనీ అవసరాలకు తక్కువ వడ్డీకి డబ్బు ఇస్తామని చెప్పి షూరిటీగా రూ.50 లక్షలు ముందుగా తేవాలని, కంపెనీ డాక్యుమెంట్లు తీసుకుని రమ్మనగా ఆ వ్యక్తి ఈనెల 18న చింతలపూడి రాగా వారిద్దరూ చింతలపూడిలోని ఎరుకులపేటలోని ఒక ఇంటికి తీసుకువెళ్లి డబ్బులు లెక్కపెట్టే నెపంతో ఇంటిలోకి తీసుకువెళ్ళి తలుపు వేసుకుని షేక్ ఖాసింను మోసం చేసి వేరేమార్గంలో అక్కడి నుంచి పారిపోయారని తెలిపారు. బాధితుడు చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారని, సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను గుర్తించి మోసపూరితంగా తీసుకుని రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఫిర్యాదుదారునికి అందించినట్టు తెలిపారు. చింతలపూడి పోలీసులు చాకచక్యంతో నిందితులను పట్టుకోవడంతో బాధితునికి న్యాయం జరగడంతో జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.

గంజాయి కేసులో ఏ7 ముద్దాయి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుతో సంబంధం ఉండి తప్పించుకుని తిరుగుతున్న పిడుగు శ్రీనివాస తమ్మారావు అలియాస్ బాబీ అనే నిందితుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారని సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 29న గంజాయి తరలిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 394.79 కిలోల గంజాయి, ఒక మారుతీ కారు, వ్యాన్ సీజ్ చేసినట్టు తెలిపారు. అదే కేసులో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం గోరింట గ్రామానికి చెందిన ఏ-7 నిందితుడు పిడుగు శ్రీనివాసతమ్మారావు అలియాస్ బాబీ రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుడు తమ్మారావుపై గతంలో మండపేట రూరల్, తిమ్మాపురం, జగ్గంపేట, రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ తదితర పోలీస్ స్టేషన్లలో 36 దొంగతనం కేసులున్నాయని, దేవరపల్లి, పెనుమంట్ర, రాజమహేంద్రవరం, నెల్లూరు జిల్లా వి.సత్రం పోలీస్ స్టేషన్లలో గంజాయి అక్రమ రవాణా కేసులున్నట్టు తెలిపారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

చేతబడి అనుమానంతో వ్యక్తిపై దాడి

» తెల్లపల్లి గ్రామంలో ఘటన.. ఇద్దరిపై కేసు నమోదు

వేలేరుపాడు, జూలై19(ఆంధ్రజ్యోతి): తమపై చేతబడి చేసి హతమార్చే విధంగా ప్రయత్నిస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం వేలేరుపాడు మండలం తెల్లపల్లి గ్రామంలో జరిగింది. వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. తెల్లపల్లి గ్రామానికి చెందిన సిరమయ్య, మడకం దేవరాజు, చోడే జోగయ్య మధ్య కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో మడకం దేవరాజు, చోడే జోగయ్య అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో సిరమయ్య తమపై చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గొడవలు మరింతగా ముదిరాయి. ఈ కారణంగానే సిరమయ్యను హతమార్చాలనే నిర్ణయానికి వచ్చిన వారిద్దరూ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో సిరమయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో వేలేరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం నిర్వహించిన అనంతరం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలపై ఆర్డీవో సమీక్ష

ఉంగుటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల్లో 1200 మంది ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌ను రాజకీయ పార్టీల నాయకులు కోరారు. శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోలింగ్ కేంద్రాల సమీక్షలో ఆయా రాజకీయ పార్టీలు పలు అంశాలను ప్రస్తావించారు. కుటుంబ సభ్యులందరికీ ఓకే బూత్‌లో ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చినుకు కోసం రైతుల ఎదురుచూపులు

పోలవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. ఈ ఎండలకు ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. రాత్రి వేళల్లో నాలుగు చినుకులు కురిసినా ఉదయం రాగానే భానుడు మండిపోతున్నాడు. మరోవైపు వర్షాలు కురిస్తే నారుమడులు పోసుకుందామని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజనుకు ముందుగా ఆకుమడులు వేసిన రైతులు వర్షాల కోసం పడిగాపులు కాస్తున్నారు. నారు ముదిరిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి : కిశోర్


కిశోర్

జంగారెడ్డిగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ పేర్కొన్నారు. శనివారం కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు, కార్యకర్తలకు ప్రతీ బుధవారం పట్టణ కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నట్టు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో పట్టణంలోని 29 వార్డు కమి టీలన్నీ ఏకగ్రీవమైనట్టు కిశోర్ తెలిపారు. అలాగే పట్టణంలో ఉన్న సొసైటీ త్రిసభ్య కమిటీను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఇప్పటికే ఎంపిక చేశారని, అధిష్ఠానం ప్రకటిం చాల్సి ఉందన్నారు. అలాగే దేవస్థానాల అభివృద్ధి కమిటీలు, గ్రంథాలయం ఛైర్మన్ల నియామకాలను మరో పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్ పదవిని జంగారెడ్డిగూడెం నుంచి టీడీపీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్, అబ్బిన దత్తాత్రేయ, మహంకాళి రామ్మోహనరావు, మద్ది దేవస్థానం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పదవిని సీనియర్ నాయకుడు రాజాన సత్యనారాయణ(పండు) ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ సారి తప్పనిసరిగా పట్టణ వాసులకే ఏఎంసీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యేకు విన్నవించినట్టు కిశోర్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయండి

దెందులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. చింతమనేని మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించడంలో అధికారుల పాత్ర కీలకమని అన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, మండల స్థాయి అధికారులు ఏఈలు టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోత్కూరి నాని, గారపాటి కొండయ్య చౌదరి, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

చింతలపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సర్కిల్ కార్యాలయంలో చింతల పూడి, ధర్మాజీ గూడెం పోలీస్‌స్టేషన్ల పరి ధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్లకు అవగా హన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లే వాహన డ్రైవర్లు ప్రమాదాల నివారణకు అధికారులు చెప్పే సూచనలు పాటించాలన్నారు. విద్యార్థుల భద్రతపై డ్రైవర్లకు ఉన్న బాధ్యత ఎంతో ముఖ్యమైందని, నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలకు దారితీసే అవకాశముందన్నారు. సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి..

భీమడోలు: సోషల్ మీడియా పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహన అవసరమని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ అన్నారు. భీమడోలులోని మానసా పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. భీమడోలు పోలీసు అధికారులు ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

'రోజాపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ఏలూరు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహిళల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకవ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ మహిళా విభాగం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు సరిత విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి, దెందులూరు జడ్పీటీసీ నవకాంత, కార్పొరేటర్లు, జిజ్జివరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి మాట్లాడారు. మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

విద్యుత్ మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న విద్యుత్ మీటర్ల రీడర్స్‌తో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్స్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకువస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లకు ఉపాధి పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పి.ప్రకాష్, శంకర అప్పారావు, మల్లేశ్వరరావు, లక్ష్మణరావు, సూరిబాబు, అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



ఏలూరు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఏపీ ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం కార్మిక సంఘాలతో ఆ శాఖ డీసీఎల్‌పీ శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి సుమారు 35వేల పెండింగ్లో ఉన్న క్లైమ్‌లను విడుదల చేయాలన్నారు. ఈనెల 20న శ్రీకాకుళంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పతివాడ రవి, ఉమా సాయి, కోడి రవి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నరికేసిన చెట్లు... నిలిచిపోతున్న ట్రాఫిక్


రోడ్డుకు అడ్డంగా వేసిన చెట్ల కొమ్మలు

పోలవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే రోడ్డులో ప్రగడపల్లి సమీపంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను రహదారులు భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టుదారుల చేత నరికిస్తున్నారు. శనివారం రోడ్డుపై భారీ వృక్షాలు నరికిపడేసి తొలగించకపోవడంతో ఆ మార్గంలో ఇరువైపులా రాకపోకలు సాగించే వాహనాలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఉదయం సాయంత్రం పాఠశాలలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధుల నిర్వహణ కోసం రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులు ప్రయాణం జాప్యమవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

నీరు లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఏలూరుకార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సౌకర్యార్థం ఇండోర్ స్టేడియానికి వచ్చిన వాకర్స్‌కు, అన్నక్యాంటీన్‌కు వచ్చిన ప్రజల కోసం సౌకర్యంగా ఉండేందుకు స్టేడియం గేటు వద్ద స్వచ్ఛ భారత్ పేరుతో మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించినా వినియోగంలోకి రాకపోవడంతో అదికాస్తా శిథిలావస్థకు చేరింది. ఇటీవల కొందరు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తెరిచినా పరిశుభ్రత కరువైంది. నీటి సౌకర్యం లేకపోవడంతో ఎలా ఉపయోగించుకుంటామని పలువురు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన స్వచ్ఛ భారత్ సముదాయానికి తుది మెరుగులు దిద్ది మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్లకు స్టాంపుల కొరత

(5వ పేజీ తరువాయి)

శాఖ ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నగర పరిధిలో స్టాంప్ వెండర్లు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఇటీవల మా శాఖ పరంగా ఇండెంట్ పెట్టగా, రూ. రెండు కోట్ల ఏడు లక్షల అన్ని రకాల విలువైన స్టాంప్‌లు వచ్చాయి. వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పంపిణీ చేశాం. కొద్దిరోజుల్లో అందరికి చేరతాయి. ఏమైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి' అని సూచించారు.

పంచాయతీలకు ఇన్‌చార్జిలు వద్దు!

గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన

దెందులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి):గ్రామాల ఆలనా పాలనా, పారిశుధ్య పనుల పర్యవేక్షణ కార్యదర్శుల చేతిలోనే ఉంటుంది. అలాంటి కార్యదర్శుల నియామకాల విషయంలో అశ్రద్ధ వహిస్తూ గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జిల పాలనా విధానానికి స్వస్తిపలికి శాశ్వతంగా గ్రామానికొక కార్యదర్శిని నియమించాలంటూ ప్రజలు కోరుతున్నారు. దెందులూరు మండలంలో నాలుగు పంచాయతీలకు ఒక్కరే పంచాయతీ కార్యదర్శి ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో అత్యంత కీలకమైన సోమవరప్పాడు పంచాయతీకి పనిచేస్తున్న కార్యదర్శికి అదనంగా పోతునూరు, కొవ్వలి, దోసపాడుతో కలిపి నాలుగు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. తరచూ సర్వేలు, యాప్‌లు, నివేదికలు, సమీక్షలతో పని ఒత్తిడితో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెందులూరులో 17పంచాయతీలకు గానూ చల్లచింతలపూడి, పెరుగుగూడెం ఒక్కరు, రామారావుగూడెం, పెరుగుగూడెం(తిమ్మన్నగూడెం), ముప్పవరం ముడు పంచాయతీలకు ఒకరు, దెందులూరు, గోపన్నపాలేనికి ఒకరు, సానిగూడెం, గంగన్నగూడెం, గాలాయగూడెం పంచాయతీలకు ఒకరు పని చేస్తున్నారు. ఇన్‌చార్జిలను నియమించడం వల్ల ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల్లో పని జరగడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీకి ఒక్కరు చొప్పున కార్యదర్శులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



దోసపాడు గ్రామ సచివాలయం

ప్లాస్టిక్‌ను వాడొద్దు..

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో అవగాహన


కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, అధికారులు

ఏలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది పని చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై నిర్వహించిన కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. మానవాళి మనుగడకు ప్లాస్టిక్ నిర్మూలన ఎంతో ప్రధానమన్నారు. ప్లాస్టిక్ బదులుగా జూట్, స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, సూపరింటెండెంట్లు జీవీ శేషగిరి, రవికుమార్, పోతురాజు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించిన జేసీ మొక్కలు నాటారు.

● ఏలూరుటూటౌన్: ఏలూరును స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై 16వ డివిజన్‌లో మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇడా ఛైర్మన్ శివ ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, చోడే వెంకటరత్నం, కమిషనర్ భానుప్రతాప్, ఆర్డీవో అంబరీష్, తహసీల్దార్ గాయత్రి, పెదబాబు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రూరల్ మండలం మాదేపల్లిలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో వెన్న శ్రీలత పాల్గొని సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

● ఏలూరు క్రైం: స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ పనిచేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం సిబ్బందికి అవసరమని అన్నారు. ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

● పోలవరం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ప్లాస్టిక్ మహమ్మారిని దూరం చేయడానికి అంతా తమవంతుగా కృషి చేయాలని కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం కార్యాలయ ఆవరణలో ఉద్యోగులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. మండల కేంద్రంలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్టు ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. తహసీల్దార్ పి.వి.చలపతిరావు, ఈవోపీఆర్డీ వి.ఎస్.ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీవారి దేవస్థానం ఈవో ఎస్వీ సత్యన్నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ద్వారకా తిరుమల క్షేత్ర పరిసరాల్లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో దుకాణాలు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ వేదికపై ఎం.ప్రశాంతకుమార్, ఎం.తిరుపతి కుమార్ బృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. జిల్లా పర్యావరణ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ఏఈవోలు పి.నటరాజారావు, రమణరాజు, డీఈ టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, నాయకులు పరిమి సత్తిపండు, మహంకాళి రామ్మోహనరావు, రామాంజనేయులు, బత్తిన చిన్నా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మక్కినవారిగూడెంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న దృశ్యం

● పెదపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టరు పి.జె.అమృతం తెలిపారు. వట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం సందర్శించి, సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్యకేంద్రం ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. డాక్టరు సత్యనారాయణ, బసవరాజు, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలంతా గ్రహించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు.నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులతో పాతబస్టాండ్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం సహకరించాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు, కూటమి నాయకులు అప్పారావు, ధర్మరాజు, శేషగిరి, తోట నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎ.వెంకటేశ్వరరావు, జె.కె.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిడమర్రు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి విజయకుమారి పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎంపీడీవో విజయకుమారి, ఈవోపీఆర్డీ స్వామి, కార్యదర్శులు మామడూరి సంజీవరావు, రామారావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: నక్కినవారిగూడెం సహకార సంఘ సీఈవో యూవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సహకార సంఘ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో కట్రెడ్డి వెంకటేశ్వరరావు, పద్మనాభశాస్త్రీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ ఏడాదిలో నెరవేర్చాం


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

చింతలపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంపై ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది మంజూరైన నిధులు, వినియోగంపై సమీక్షించారు.ఇక నుంచి ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలని, అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నెహ్రూ, నాలుగు మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.అనంతరం క్యాంపు కార్యాలయంలో ప్రస్తుతం మంజూరైన 54 మందికి 45 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు.

ఇంటింటికీ ప్రచారం చేసిన నాయకులు

● లింగపాలెం: మండలంలోని మఠంగూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు తూంపాటి కిషోర్, జాస్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు తాళం సోమేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి నవీన్, దాదినబోయిన సుబ్బారావు, పొదిల అనంతరావు, కట్టా ప్రభుదేవా, తాళ్లూరి తంబి పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చామని ఎమ్మెల్యే చంటి అన్నారు. 8వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నికల తరువాత ప్రతి రోజు ప్రజల్లోనే ఉంటున్నామన్నారు. మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, శివప్రసాద్, ఎం.పార్థసారథి, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.


కాలువలో పేరుకున్న తూడు తొలగిస్తున్న దృశ్యం

ఏలూరు-కృష్ణా కాలువలో తూడు తొలగింపు

పెదపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు-కృష్ణా కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న బద్దనాచు, తూడు తొలగింపు పనులు చేపట్టినట్టు ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ కె.బాబు తెలిపారు. కృష్ణా కాలువలో తోటగూడెం -పునుకొల్లు గ్రామాల పరిధిలో జరుగుతున్న తూడు తొలగింపు పనులను పెదపాడు డీసీ ఛైర్మన్ బొప్పూడి కాశీబాబుతో కలిసి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాశీబాబు మాట్లాడుతూ కృష్ణా కాలువ కింద ఉన్న ఆరు నీటి సంఘాల పరిధిలో పెరికీడు నుంచి 11 కిలోమీటర్ల మేర తూడు తొలగింపు పనులు చేపట్టామన్నారు. ప్రతి రోజూ 50 మంది కూలీలతో పనులు చేయిస్తున్నట్టు తెలిపారు. అలాగే క్రిస్టియన్ బోది ఆయకట్టు కింద ఉన్న వెయ్యి ఎకరాలకు మోటార్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. ఏఈ కె.సూర్యతేజ, రమేష్, గాంధీ, రామకృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్లో సౌకర్యాల పరిశీలన

కామవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆడమిల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నిర్వహిస్తున్న హాస్టల్‌ను సర్పంచ్ గూడపాటి కేశవరావు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తనిఖీ చేశారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లపై ఆరా తీశారు. ఆయన వెంట టీడీపీ బీసీ సెల్ చింతలపూడి నియోజకవర్గం నాయకులు జిజ్జూరి బాబ్జీ, కళాశాల సిబ్బంది ఉన్నారు.


సామూహిక పారాయణ చేస్తున్న మహిళలు

అంబికాదేవికి ప్రత్యేక పూజలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం నేపథ్యంలో సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో శనివారం అగ్రహారానికి చెందిన సౌందర్య లహరి భక్తి టిట్టి పాదర్తి జ్యోతి బృందం, అంబికాదేవి ఆలయ లలితా పారాయణ బృందం సంయుక్తంగా సామూహిక సుందరకాండ పారాయణ నిర్వహించారు. తొలుత అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపించారు. ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు, మిత్రబృందం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బి.సరోజా దేవి, కోట మృతికి నివాళి

జంగారెడ్డిగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సినీ నటులు బి.సరోజా దేవీ, కోట శ్రీనివాసరావు మృతి చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటని కాసర నర్సిరెడ్డి కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాసర నర్సిరెడ్డి అన్నారు. ఎంబీ సోషల్ క్లబ్‌లో కాసర నర్సిరెడ్డి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసర నర్సిరెడ్డి, సంస్థ కోశాధికారి దారం సత్యనారాయణ మాట్లాడుతూ ఇద్దరినీ తెలుగు ప్రేక్షకులు మరువలేనిరన్నారు. కాసర వెంకటరెడ్డి సంస్థ కార్యదర్శి టి.వి.రామకృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, విజయరత్నం, తిరుపతి రమేశ్, మాజీ సైనికుడు డి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఆత్మహత్య చేసుకుందామని వెళ్తే..

భీమడోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అప్పులపాలై తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధం కాగా పోలీసులు గమనించి అతడిని రక్షించి కౌన్సెలింగ్ నిర్వహించిన ఘటన భీమడోలులో జరిగింది. బాపట్ల జిల్లా యద్దనపూడి గ్రామానికి చెందిన గంజి వెంకటకృష్ణ తన గ్రామంలో వ్యక్తిగత అవసరాల నిమిత్తం 7 లక్షలు అప్పులు చేశాడు. ఆ అప్పు తీర్చేందుకు ఉంగుటూరు మండలంలోని హైవేపై ఉన్న టోల్ ప్లాజాలో డ్రైవర్‌గా చేరాడు. కొంతమేర బాకీ తీర్చినా మిగతావారి నుంచి ఒత్తిడి పెరగడంతో తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందామని భీమడోలు సమీపంలో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు 112కి ఫోన్ చేయడంతో భీమడోలు పోలీసులు 15 నిమిషాల్లో ఆవ్యక్తిని గుర్తించి రక్షించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ ఇచ్చి హరికృష్ణను ఇంటికి పంపారు.

మొబైల్ దుకాణాలపై దాడులు సరికాదు

ఏలూరు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు మొబైల్ షాప్ ఓనర్స్‌పై మొబైల్ విడిభాగాల వ్యాపారులు దాడులు, రౌడీషీటర్లతో బెదిరింపులు, ఇదేమని అడిగితే అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తీవ్రంగా ఖండించారు. ఏలూరులో జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ ఏపీసీ సభ్యులు ఏలూరు మొబైల్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంఘీభావం తెలిపి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఏపీ ఎంటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.వేణుగోపాల్, కార్యదర్శి ఎన్.హేంసుందర్ మాట్లాడుతూ ఏలూరులో 160 మంది కుటుంబాలు సెల్‌ఫోన్ టెక్నీషియన్ వర్క్‌పై ఆధారపడ్డాయన్నారు. ఇటీవల స్థానికేతరులు మొబైల్ విడిభాగాలు అమ్మకంతో పాటు మొబైల్ రిపేర్ కూడా చేస్తున్నారని ఇది యూనియన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. వీటిని ప్రశ్నిస్తే బెదిరింపులతో పాటు అక్రమ కేసులు పెట్టి వేధించడాన్ని ఖండించారు. సమావేశంలో గౌరవ సలహాదారుడు ఎండీ ఆరీఫ్, తూర్పుగోదావరి జిల్లా జేఏసీ కోకన్వీనర్ వి.శ్రీనివాస చౌదరి, ఏలూరు మొబైల్ షాప్స్ ఓనర్స్ వెల్ఫేర్ నాయకులు మదన్ మోహన్ కుమార్, గురజాల సైమన్ పాల్గొన్నారు.

స్మృతి వనానికి స్థలం కేటాయింపుపై హర్షం

ఏలూరు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 6ఎకరాల 80 సెంట్ల స్థలం కేటాయింపుపై వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షులు తిరివీధి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధానిలో పొట్టి శ్రీరాములు ట్రస్ట్‌కు 6.80 ఎకరాల స్థలం కేటాయించి 58 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి స్మృతి వనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల్లో హామీ మేరకు కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తుందని కొనియాడారు.

22న ఉద్యోగ మేళా

ఏలూరుకార్పొరేషన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి, శిక్షణ శాఖ, నేషనల్ కెరీయర్ సర్వీస్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయ ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేళాలో వివిధ ప్రముఖ సంస్థలు పాల్గొంటాయన్నారు. ఎంపికైన వారికి మంచి వేతన సౌకర్యాలు ఉంటాయని, యువత తమ పేర్లు నమోదు చేసుకోవాలని, సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు(88868 82032)సంప్రదించాలని వరలక్ష్మి కోరారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు స్వాధీనం

పెదపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను మండల పరిధిలోని కొల్లేరు, పరిసర గ్రామాల చేపల చెరువులకు తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి మూడు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న చికెన్ వ్యర్థాలు గొయ్యి తీసి పూడ్చి పెట్టినట్టు తెలిపారు.

పూడిక తీయించండి

కామవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని కొత్తూరు బత్రాజుల కాలనీలో డ్రెయినేజీల్లో పూడికలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు. కొద్దిపాటి వర్షమొచ్చినా నీరు నివాసాల్లోకి వస్తోందని పంచాయతీ కార్యదర్శి పి.రవినాయక్‌కు ఆ ప్రాంత ప్రజలు శనివారం ఫిర్యాదు చేశారు.

ప్రజలపై భారం తగ్గించండి

కుక్కునూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం వేస్తోందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం కుక్కునూరులో సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సెలింగ్ సమావేశంలో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు, తదితర చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సిబ్బంది ఇళ్లకు వచ్చి స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టాలన్నారు. ఒంగోలులో ఆగస్టు 23 నుంచి 25 వరకు జరిగే రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కారం దారయ్య, వరకా శ్యామల, సోమరాజు, బడిస రాము, కొన్నే లక్ష్మయ్య, ఐతా సురేశ్, బాబూరావు, ఎం.వెంకటాచారి, పాపారావు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాస బహుళ శుద్ధ నవమి సందర్భంగా స్వామికి భూదేవి శ్రీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిదర్శనానంతరం మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు పూజల్లో పాల్గొన్నట్టు ఆలయ అర్చకులు శంకర మంచి వెంకట్రామ శర్మ తెలిపారు.

80 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

జంగారెడ్డిగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన అకీరా కంటి ఆస్పత్రి వైద్యులు 80 మందికి సేవలందించారు. ఈహెచ్ఎస్, ఇతర బీమా కార్డుల ద్వారా అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు. కార్యవర్గ సభ్యులు ఎస్.రాధాకృష్ణ, కె.రాజేశ్వరరావు, కె.త్రినాథరావు, ఎం.అయ్యన్న, కె.వీరాస్వామి, ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆగ్రో కంపెనీ ఆధ్వర్యంలో..

దెందులూరు: కోకో రైతులకు వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు మాండలీజ్ ఆగ్రో సంస్థ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కోకో కంపెనీ మేనేజర్ సి.హెచ్.చిన్నబాబు, తెలిపారు. కూచింపూడిలోని సచివాలయం వద్ద గుడ్ సమారిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరాన్ని చేపట్టి 250 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆగ్రో ప్రాజెక్టు పి.విజయ్ ప్రసాద్, డాక్టర్ చంద్ర, గుడ్ సమారిటన్ ఆస్పత్రి పి.ఆర్.ఓ వినిల్ పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ

చింతలపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు శనివారం తనిఖీ చేశారు. సబ్ జైలులో పర్యవేక్షించి ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. మంచి నీరు, వైద్య సదుపాయాలు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, ప్యానల్ లాయర్స్ విజయరావు, బి.నాగార్జునసాగర్ పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి వరద

పోలవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పోలవరంలో గోదావరి నీటిమట్టం నిలకడగా ఉంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 1,11,523 క్యూసెక్కులు, పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు శనివారం తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.210 మీటర్లు, దిగువన 17.430 మీటర్లు నమోదైనట్టు అధికారులు తెలిపారు.

పాఠశాలలు అభివృద్ధి చేస్తాం

ఉంగుటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పోస్టుల కల్పన గురించి సమీక్షించారు. ఎంఈవోలు గొర్రెలు బాలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కామినేని రాక

కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అమెరికా పర్యటన ముగించుకుని ఆదివారం కైకలూరు రానున్నారు. ఆదివారం ఉదయం ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెంలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే ఆడి కావడి ఉత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కైకలూరులో మానవత ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం నుంచి వరహాపట్నంలోని ఆయన స్వగృహం వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

నేటి సాయంత్రం వరకు శ్రీశ్యామలాంబ దర్శనం నిలిపివేత



కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్నపన కార్యక్రమం నిమిత్తం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీ శ్యామలాంబ అమ్మవారి దర్శనాన్ని నిలిపివేస్తున్నట్టు ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి యథావిధిగా అమ్మవారి దర్శనం ఉంటుందని, భక్తులు గమనించాలని కోరారు.

తాగునీటి చెరువుల ప్రక్షాళన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మట్టగుంట తాగునీటి చెరువులో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

కలిదిండి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొండంగి, మట్టగుంట గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో కలుషిత నీటిని తొలగించారు. "కలుషిత నీరే దిక్కు" శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీటిని బయటకు తొలగించి తాజా నీటితో చెరువులను నింపుతున్నారు. తాగునీటి చెరువులను నింపటానికి ఇరిగేషన్ అధికారులు తాగునీటిని విడుదల చేశారు. కాల్వల్లో నీటి సరఫరా తక్కువగా ఉండటంతో మోటారు పంపు సెట్‌లతో తోడుతున్నారు. తాగునీటి చెరువుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నారు. చెరువుల్లో క్లోరినేషన్ చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి శంకర్ తెలిపారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బద్రీనాథ్

ముసునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాగునీటి జాగ్రత్తలతోనే ఫ్లోరోసిస్ వ్యాధి నివారణ సాధ్యమని జిల్లా కన్సల్టెన్స్ ఆఫీసర్ డాక్టర్ బద్రీనాథ్ అన్నారు. శనివారం కాట్రేనిపాడులోని పాఠశాలల్లో విద్యార్థులకు ఫ్లోరోసిస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీటిని తాగడం వల్ల ఎముకల సంబంధిత ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని, అందువల్ల మినరల్ వాటర్‌ను తాగాలని వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి అవగహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శాసనమండలి చైర్మన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



కైకలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ ఎంఏ షరీఫ్‌ను కైకలూరు టీడీపీ మైనార్టీ నాయకులు శనివారం నరసాపురంలో ఆయన ఇంటి వద్ద కలిశారు. ఆయనకు పలు సమస్యలు వివరించి సూచనలను తీసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ కైకలూరు పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, జిల్లా మైనార్టీ కార్యదర్శి సయ్యద్ బాషిద్, పార్టీ కలిదిండి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అస్లాం, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులకు బదిలీ సత్కారం

ముసునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగులు ఐదుగురు బదిలీ కావడంతో వారిని శనివారం సర్పంచ్, టీడీపీ నాయకులు సన్మానించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఆనంద్, డిజిటల్ అసిస్టెంట్ ఉమాదేవి, మహిళా పోలీస్ రమణ, విలేజ్ హార్టికల్చర్ అధికారిణి సాత్విక, ఏఎన్ఎం రేఖల సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి సత్యనారాయణ, మామిడిశెట్టి గిరిబాబు తదితరులు సన్మానించి, వారి సేవలను కొనియాడారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి నూతనంగా వచ్చిన సచివాలయ ఉద్యోగులకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల పనితీరు భేష్ : జోజిబాబు



చాట్రాయి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాల పనితీరు సంతృప్తికరంగా ఉందని మానిటరింగ్ అధికారి, అంగలూరు డైట్ కళాశాల అధ్యాపకులు ఎస్. జోజిబాబు అన్నారు. చాట్రాయి, చనుబండ జడ్పీ హైస్కూళ్లలో శనివారం జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జోజిబాబు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజనం పథకం అమలు, టెన్త్‌లో సాధించిన ఫలితాలు, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ మొదలైన వివరాలను కాంప్లెక్స్ చైర్మన్‌లు కృష్ణయ్య, రవీంద్రనాథ్‌లను అడిగి తెలుసుకున్నారు. సి. గుడిపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బక్కయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

ముసునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ వల్ల బాధితుల మనోభావాలు దెబ్బ తింటాయని నూజివీడు సీఐ కె.రామకృష్ణ అన్నారు. శనివారం ముసునూరు గురుకుల పాఠశాల బాలికలకు యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వలన జరిగే అనర్థాలపై ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ ఉద్యోగాల పేరుతో చేసే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి..

మండవల్లి, జూలై 19(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ పేర్కొన్నారు. లోకుమూడి వికాస్ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు శక్తి యాప్, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ ర్యాగింగ్ యాక్ట్, యాంటీ డ్రగ్స్, అబ్యూజ్‌యాక్ట్, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై రామచంద్రరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు స్టాంపుల కొరత

(5వ పేజీ తరువాయి)

శాఖ ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నగర పరిధిలో స్టాంప్ వెండర్లు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ 'ఇటీవల మా శాఖ పరంగా ఇండెంట్ పెట్టగా, రూ.రెండు కోట్ల ఏడు లక్షల అన్ని రకాల విలువైన స్టాంప్‌లు వచ్చాయి. వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పంపిణీ చేశాం. కొద్దిరోజుల్లో అందరికి చేరతాయి. ఏమైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి' అని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కైకలూరులో ప్లాస్టిక్‌ను నిషేధించాలని అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, అధికారులు



ముదినేపల్లిలో ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, ఉద్యోగులు



కలిదిండిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



చాట్రాయిలో తడి, పొడి చెత్త సేకరిస్తున్న అధికారులు



నూజివీడులో చేతి సంచులు ఇస్తున్న ఎక్సైజ్ సిబ్బంది



ఆగిరిపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో భార్గవి

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అధికారుల పిలుపు.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలు.. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతినలు

కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. శనివారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి. నరసయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు. తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఎంపీడీవో వై రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే కైకలూరు రైతుబజారు ఎస్టేట్ అధికారి పి. నందినీదేవి ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నివారించాలని రైతులు, రైతు బజారు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కూరగాయలు కొనుగోలుకు వచ్చే ప్రజలు గుడ్డ సంచులను తెచ్చుకోవాలని సూచించారు.

ముదినేపల్లి: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలో స్వచ్ఛ దివస్ సందర్భంగా ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో వివిధ శాఖల ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మినా, వినియోగించినా రూ.500ల నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామని ఎంపీడీవో తెలిపారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, జనసేన నాయకులు వేల్పూరి నానాజీ, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యార్థులతో ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

కలిదిండి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛాంధ్రను సాధించాలని ఎంపీడీవో ఫణీంద్ర అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ర్యాలీ, మాన వహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ రామ కృష్ణ, ఈవోపీఆర్‌డి రమేష్, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న, ఈవో ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

చాట్రాయి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చాట్రాయిలో శనివారం మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో వ్యాపార సంస్థల నుంచి తడి, పొడి చెత్త సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయటం వల్ల అపరిశుభ్రత నెలకొని దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందరూ బాధ్యతతో తడి, పొడి చెత్తను ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మగూడెం హెచ్‌డబ్ల్యు స్కూల్ హెచ్‌ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలవరం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

ముసునూరు: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి సుందరి, తహసీల్దార్ డి. ప్రశాంతి, ఎంపీడీవో బీపీ సత్యనారాయణ అన్నారు. మండల వ్యాప్తంగా శని వారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వేల్పుచర్లలో ప్లాస్టిక్ నివారణపై జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. అనంతరం గ్రామాల్లో అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహించి, దుకాణదారులకు ప్రభుత్వ ఆదేశాలను వివరించి, ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ సామాగ్రి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఎంపీడీవో బి. భార్గవి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కిరాణా, హోటల్ యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులు జనపనార, గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడం అని ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్‌బాబు, సర్పంచ్ లక్ష్మీవిక్టర్ బాబు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి రాగమయి ఆధ్వర్యంలో బొద్దనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

నూజివీడు: భావితరాలకు ప్లాస్టిక్‌తో కలుగుతున్న ఇబ్బందులను దూరం చేసే దిశగా అడుగులు వేయాలని అధికారులు పేర్కొన్నారు. చేనేతను తిరిగి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని వివరిస్తూ చేతి సంచులను అందించారు. నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎం. మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోను స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

రక్షణ ఏదీ?

ప్రమాదకరంగా అంగన్వాడీ కేంద్రం, కల్వర్టు



ముదినేపల్లిలో ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం

ముదినేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో పంచాయతీకి చెందిన రెండు చెరువుల మధ్య ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి రక్షణ కరువైంది. అంబేడ్కర్ నగర్‌కు సమీపంలోని ఈ అంగన్ వాడీ కేంద్ర భవనానికి ప్రహరీ గోడ లేకపోవడంతో పిల్లలకు రక్షణ కల్పించడం సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంది. ఈ అంగన్‌వాడీ కేంద్రం ముందువైపు పంచా యతీ రక్షిత మంచినీటి చెరువు, వెనుక వైపు పంచాయతీ చెరువులు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వెళ్లే పిల్లలను సిబ్బంది వెన్నంటే ఉండాల్సి వస్తున్నది. చెరువు పోరం బోకు భూమిలో ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించడం వల్ల పిల్లలు చెరువు గట్ల వెంబడే రావాల్సి వస్తున్నది. కేంద్రం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టుకు రక్షణ గోడల్లేక..

ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిలో చినపాలపర్రు శివారు అత్తివాని చెరువు గ్రామం వద్ద కోడూరు రోడ్డు సైడ్ డ్రెయిన్‌పై గల కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడల్లేక ప్రమాదకరంగా ఉంది. కోడూరు రోడ్డులోకి వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఏడాదిగా ఈ కల్వర్టు వద్ద ట్రాక్టర్లు, ఆటోలు రక్షణ గోడలు లేని కారణంగా బోల్తా పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కల్వర్టు వెడల్పు పెంచి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.



కల్వర్టు వద్ద ప్రమాదకర స్థితి

అత్తపై కోడలు, మనవడు దాడి

ముదినేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కుమారుడు చనిపోయిన బాధను మరువక ముందే మనవడి పేరున ఇల్లు రాయాలని ఒత్తిడి తెచ్చి ఓ మహిళను ఆమె కుటుంబ సభ్యులు కొట్టి తీవ్ర గాయాలకు గురి చేసిన ఘటన ముదినేపల్లి మండలం కాకరవాడ శివారు దేవరం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పల్లెపోగు మల్లీశ్వరికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉండగా వారిలో పెద్ద కుమారుడు ఏసోబు ఇటీవల మరణించాడు. అతని పెద్ద కర్మ ముగిసిన అనంతరం ఈ నెల 18న మల్లీశ్వరి నివాసం ఉంటున్న ఇంటిని తన కుమారుడు పేరున రాయమని పెద్ద కోడలు అడిగింది. ఆ సమయంలో అత్తా కోడళ్ళ మధ్య గొడవ జరిగింది. దీంతో కోడలు, మనవడు కలసి మల్లీశ్వరిని కర్రలతో కొడుతుండగా అడ్డు వచ్చిన కుటుంబ సభ్యులను కూడా కొట్టి తీవ్ర గాయాలకు గురి చేశారు. దీనిపై మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కలిదిండి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు వద్ద కాల్వలో గుర్తు తెలి యని వ్యక్తి (35) మృత దేహాన్ని పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. సన్నటి గెడ్డం, ఐద డుగుల ఎత్తు ఉన్న ఉన్న మృతుడు రెం డు రోజుల క్రితం గుడ్లవ ల్లేరు నుంచి కోరుకొల్లు వచ్చే కాల్వలో ప్రమాదవశాత్తు పడి చనిపోయి కొట్టుకొచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అతని ఆచూకీ తెలిసినవారు 94407 96435కు కాల్ చేయాలని ఎస్ఐ వెంకటేశ్వరరావు కోరారు.

మంచి నీరనుకుని గడ్డిమందు తాగి..

కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): గడ్డిమందును మంచి నీరనుకుని తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని కొట్టాడ గ్రామానికి చెందిన మోరు నవీన్(35) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటి ఆవరణలో పచ్చగడ్డిని నివారించేందుకు గడ్డిమందును తీసుకు వచ్చాడు. అయితే ఈ నెల 17న ఆ మందును అతని భార్య వాటర్ బాటిల్‌తో సమానంగా పెట్టింది. నవీన్ బాటిల్‌లోని మందును తాగు నీరు అనుకుని తాగేశాడు. దీంతో నవీన్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు అతన్ని భీమవరం లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సిద్ధమైన ఆడి కావళ్లు

నేడు ఆడి కావడి ఉత్సవం

ముదినేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న ప్రసిద్ధ శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడి కావడి మహోత్సవం ఆదివారం జరుగనుంది. ఈ ఉత్సవంలో 105 మంది ఐదు రకాల కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించి స్వామికి కావడిని సమర్పిస్తారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు 105 ఆడి కావిళ్లను సిద్ధం చేశారు. తొలిసారిగా ఆలయంలో ఈ ఉత్సవం జరగనున్నందున భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, సిబ్బంది కావిళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం రానున్నారు. కావిళ్ల గ్రామోత్సవంలో పాల్గొంటారు.



సారె తీసుకువస్తున్న దృశ్యం

వాసవి మాతకు సారె సమర్పణ



శాకాంబరిగా వాసవి

ఆగిరిపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలోని వాసవి మాతకు ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. శనివారం మహిళలు సారెతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వెంకటరత్నం, ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి చినసత్యం, మహిళా మండలి అధ్యక్షులు సీహెచ్. శైలజ, మండల టీడీపీ నాయకులు మడుపల్లి గోపాలకృష్ణకుమార్, యండూరు శివరాం పాల్గొన్నారు.



కోరుకొల్లులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

కలిదిండి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం కోరుకొల్లులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి నల్లిబోయిన భోగేశ్వరరావు, నాయకులు వేణుగోపాలకృష్ణ, నల్లిబోయిన నాంచారయ్య, మీగడ వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై మళ్లీ భగ్గు!

బదిలీ ఏఎన్ఎంలలో ఆందోళన

ఏలూరు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎం(హెల్త్ సెక్రటరీ)లకు ఇటీవల జరిగిన బదిలీల్లో తాజాగా మరోదఫా మార్పులు, చేర్పులు చేటుచేసుకున్నాయి. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు ముగిసిన ఏఎన్ఎంలకు ఈనెల మొదట్లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌పై వివాదాలు చెలరేగిన విషయం విదితమే. ఈమేరకు బదిలీలు ఖరారైన 594 మంది ఏఎన్ఎంలను విధుల నుంచి రిలీవ్ చేయవద్దని, ఆ మేరకు తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు ఎక్కడివారక్కడే పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు మౌఖిక ఆదేశాలిచ్చాయి. దీనికనుగుణంగానే తొలుత విడుదల చేసిన జాబితాలో బదిలీ స్థానాలు ఖరారైనవారిలో పలువురి స్థానాలను సవరిస్తూ మొత్తం 584మంది రూరల్ ఏఎన్ఎంలతో కూడిన జాబితాను తాజాగా శుక్రవారం రాత్రి విడుదల చేయగా, శనివారం ఉదయం నుంచే పలువురు ఫిర్యాదులతో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరుకోవడం ప్రారంభమైంది. తొలుత జరిగిన జూమ్ కౌన్సెలింగ్‌లో నిబంధనల మేరకు బదిలీ స్థానాలు ఖరారైన పలువురు ఏఎన్ఎంలు తాజాగా సవర ణలతో కూడిన జాబితాలో స్థానచలనం కలగడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ ప్రమేయం లేకుండా, కనీసం ఐచ్ఛికాలివ్వని స్థానాలకు ఏకపక్షంగా ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. ప్రతి మండలం నుంచి ఇటువంటి ఫిర్యాదులున్నట్టు తెలుస్తోంది. ఫిర్యాదులను తీసుకున్న డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాజా సవరణల్లో అభ్యంతరాలను మాత్రమే స్వీకరిస్తా మని, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు, సంబంధిత సెక్షన్ ఉద్యోగి ప్రస్తుతం అందుబాటులో లేరని పంపే స్తున్నారని వాపోతున్నారు.

తాజాగా విడుదల చేసిన జాబితాలోవున్న ఏఎన్ఎంలందరూ తక్షణమే పని స్థానాల్లో విధుల నుంచి రిలీవై, ఆ వెంటనే నూతన బదిలీస్థానాల్లో చేరాలని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీచేయడంతో నష్టపోయిన ఏఎన్ఎంలలో ఆందోళన నెలకొంది. మరోవైపు తొలుత విడుదల చేసిన బదిలీల జాబితా, తాజాగా సవరణలతో కూడిన జాబితా రెండింటిపైనా రిలీవింగ్, జాయి నింగ్‌లను ఈనెల 5వ తేదీని పేర్కొనగా, ఇప్పుడు శనివారం కొత్తస్థానాల్లో చేరితే సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని తెలు స్తోంది. ఇటీవల జిల్లానుంచి బదిలీఅయిన అధికారి పాలన లో జరిగిన ఉద్యోగుల సాధా రణ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియల్లో పారదర్శకత లోపిం చిందనడానికి డీఎం హెచ్ వో కార్యాలయం వద్ద గత నెలలో ఒకరోజున తెల్లవారురూము వరకు జరిగిన ఆందోళనలు, ఒకసారి బదిలీ ఖరారైన ఉద్యోగుల్లో కొందరికి మళ్లీ మార్పులు, ఆ మేరకు కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత సవరణలు, ఉన్నతాధికారుల చీవాట్లు, స్వయంగా ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవాల్సి రావడం.. ఇవన్నీ పరిపాలనాపరమైన వైఫల్యాలుగా భావిస్తున్నారు.

అన్యాయం జరిగితే నేరుగా సంప్రదించండి : డీఎంహెచ్‌వో

సచివాలయ ఏఎన్ఎంల బదిలీలపై వస్తున్న ఫిర్యాదులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం వద్ద వివరణ కోరగా కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాతే తాను బాధ్యతలు చేపట్టినందున పూర్తివివరాలు తెలియవన్నారు. బదిలీలు ఖరారైన ఏఎన్ఎంలలో కొందరు తమ పనిస్థానాలు, మండలాల పేర్లలో తప్పులు దొర్లాయని శనివారం ఫిర్యాదు చేశారని, వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా కార్యాలయ సిబ్బందిని ఆదేశించానన్నారు. ఇంకా ఎవరికైనా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తే, దానికి సహేతుకమైన ఆధారాలతో నేరుగా వస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.